
# వాయిదా

దూరి వెంకటరావు



ఆదివారం.

బ్యాగు పుచ్చుకుని రైతు బజారుకు బయల్దేరింది శ్రావణి.

అనూహ్యంగా అక్కడ తన క్లాస్‌మేట్ కనబడేసరికి విస్మయానికి గురైంది.

'హాయ్ శ్రావణి...' నవ్వుతూ పలకరించింది కావ్య.

"నువ్వేంటి ఇక్కడ" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అడిగింది.

'మా వారికి ఈ ఊరు ట్రాన్స్‌ఫరయింది" ఆప్యాయంగా శ్రావణి చెయ్యి నొక్కుతూ అంది కావ్య.

తల్లి చీర చాటున దోబూచులాడుకుంటున్న బాబును, పాపను చూసి 'వీళ్ళు నీ పిల్లాలా?" అడిగింది శ్రావణి.

"ఔను. వీడు విజయ్ ఫిఫ్త్ క్లాస్, అది హారిక థర్డ్ స్టాండర్డ్" పిల్లల్ని పరిచయం చేసింది.

ముద్దుగా బొద్దుగావున్న ఆ చిన్నారుల్ని దగ్గరకు తీసుకుని వాళ్ళ బుగ్గల్ని చిదిమింది శ్రావణి.

"ఈ దగ్గర్లోనే ఉంటున్నాం" అని చెప్పి శ్రావణిని తనింటికి లాక్కెళ్ళింది కావ్య.

స్నేహితురాల్ని హాల్లో కూర్చోబెట్టి కాఫీ పట్టుకొచ్చింది.

'ఔనూ, నువ్వింతవరకు నీ పిల్లల్ని గురించి చెప్పనేలేదు" అంది.

"పిల్లలా?!... లేరు..." తడబడుతూ అంది శ్రావణి.

'2001లో కదూ నీ మ్యారేజయింది. ఇంకా బిడ్డలు కలగక పోవడమేంటి" విస్తుపోతూ అంది కావ్య.

ఆ మాటతో శ్రావణికి గతం గుర్తొచ్చింది.

❖ ❖ ❖

ఎమ్.సి.ఎ. చేసిన శ్రావణికి సంబంధాలు చూడటం మొదలు పెట్టారామె తల్లిదండ్రులు.

ఉద్యోగంలో చేరేంత వరకు పెళ్ళి చేస్కోనంది శ్రావణి. అక్కడికి ఒకటికి రెండు సార్లు కూతురికి నచ్చజెప్పి చూసారు. వింటేనా? 'పెళ్ళికంటే నాకు నా కేరీర్ ముఖ్యం' అంది.

ఉద్యోగంలో చేరిన నాలుగేళ్ళకి తన కొలిక్ రాజేష్‌ని చేసుకుంటానంది. ఆలస్యంగానైనా పెళ్లికి ఒప్పుకున్నందుకు అంతా సంతోషించారు. మనవడో, మనవరాలో పుడితే ఎత్తుకుని ఆడిద్దామని కన్నవాళ్ళు ముచ్చటపడ్డారు. అయితే అందరి ఆశల్ని తలక్రిందులు చేస్తూ 'ఇప్పుడప్పుడే మనకి పిల్లలొద్దండి' అంది భర్తతో శ్రావణి.

ఆ మాటకు అవాక్కయ్యాడు రాజేష్.

'మీకు తెలియందేముంది. మనిద్దరి జాబ్స్ టెన్షన్‌తో కూడుకున్నవి. ఈ మధ్య మన కంపెని కొత్త ప్రాజెక్టు చేపట్టింది కదా! ఇరువురం మరింతగా శ్రమిస్తే తప్ప మనకి ఫ్యూచరుండదు. ఈ స్థితిలో ప్రగ్నంటైతే ఆఫీసుకి సెలవు పెట్టేయవలసి వస్తుంది. బిడ్డ పుడితే వాడిని చంకనేసుకుని పని చెయ్యాలి (చేయలేను కదా! అందుకే). ఇప్పుడప్పుడే మనకు పిల్లలొద్దు' అంటూ సంతానానికి మరికొంత కాలం వాయిదా వేసింది. ఆ తర్వాత బిడ్డలు కావాలనుకున్న కలగక పోవడంతో కలతచెంది డాక్టర్లను ఆశ్రయించారు రాజేష్ దంపతులు.

పరీక్షలు చేసి ఇరువురిలో ఏ లోపం లేదన్నారు డాక్టర్లు. మరి పిల్లలెందుకు కలగడం లేదని అడిగింది శ్రావణి.

'వయసు పెరిగే కొద్ది ఆడవాళ్ళలో ప్రెగ్నన్సీకి అవకాశాలు తగ్గిపోవడం సహజం'

డాక్టర్ మాటలకు ఏడుపొచ్చింది శ్రావణికి. సంతానం విషయంలో తను తాత్సారధోరణి అవలంబించి చాలా తప్పుచేసింది. జీవితంలో వాయిదా వేయకూడనివి కూడా కొన్ని ఉంటాయని ఆలశ్యంగా తెలుసుకుంది. తను ఎక్కడో చదివిన తాను ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు అన్నమాటలు గుర్తొచ్చాయి.

◆ ◆ ◆

తన సమాధానం కోసం ఎదురు చూస్తున్న కావ్యకి ఏం చెప్పాలో తెలీక "ప్చ్... దేనికైనా రాసి పెట్టి ఉండాలి" అన్నది వేదాంతిలా.

(నవంబర్ 2011 "భక్తిసమాచారం" మాసపత్రిక)